క్లుప్తంగా

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ



కళ్యాణదుర్గం సబ్ జైలును తనిఖీ చేస్తున్న సివిల్ జడ్జి రాజశేఖర్

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. సబ్ జైలులోని వంటగది, టాయిలెట్లు శుభ్రతను పరిశీలించారు. 21 ఏళ్లలోపు వయసున్న వారు ఎవరైనా ఉంటే స్థానిక న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఖైదీలు న్యాయవాదిని పెట్టుకునేందుకు స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణమూర్తి

కూడేరు: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించకుండా పెంచుతూ ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన కూడేరులో ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అధికారంలోకొస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు ఎన్నికలు ముందు హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఏడాది దాటినా ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి కరీం సాబ్, కమిటీ సభ్యులు మల్లికార్జున, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పల్లెల్లో 'పొలం పిలుస్తోంది'



కడదరబెంచిలో పొలంపిలుస్తోంది నిర్వహిస్తున్న ఏఓ పెన్నయ్య

విడపనకల్లు: మండలంలోని కడదరబెంచి, డొనేకల్లు గ్రామాల్లో ఏఓ పెన్నయ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కంది, జొన్న పంటలు పరిశీలించి, రైతులకు ఎంత మోతాదులో మందులు వాడాలో అవగాహన కల్పించారు. రైతులు ఈనెల 30 వరకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని కన్నేపల్లి రోడ్డులో మంగళవారం ఉదయం విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరా ఉండటంతో అటుగా వెళ్లే వాహనదారులు, స్థానికులు భయంతో ఎక్కడికక్కడే ఆగిపోయారు. విషయాన్ని విద్యుత్ అధికారులు ఫోన్లో తెలపడంతో స్పందించిన సిబ్బంది తెగిపడిన విద్యుత్ తీగలను రోడ్డుపై నుంచి తొలగించారు. కాగా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



స్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేమకల్లు ఆంజనేయస్వామికి శ్రావణమాసం నాల్గో మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాల అలంకరణలో భక్తులకు నేమకల్లు ఆంజనేయస్వామి దర్శనం ఇచ్చారు. కర్ణాటక ఆంధ్రా ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. రామాంజనేయ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టర్ నేమకల్లు వారు అన్నదానం చేశారు.

పౌల్ట్రీ ఫారాలు తనిఖీ



కోళ్ల ఫారాల వద్ద వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ రజాక్‌వలి

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ, యర్రంపల్లి గ్రామాల్లో కోళ్ల ఫారాలను తహసీల్దార్ రజాక్‌వలీ, ఏఓ నిర్మల్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఫౌల్ట్రీ ఫారాలకు అనుమతి తీసుకున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కోళ్లకు వినియోగిస్తున్న దాణాను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, విస్తరణ అధికారి ఆంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దివ్యాంగులపై నిర్దయ



- పింఛన్ల కోతకు కూటమి సర్కారు చర్యలు
- అనర్హత పేరుతో నోటీసులు అందజేత
- లబోదిబో మంటున్న పింఛన్‌దారులు



న్యాయం చేయాలని ఉరవకొండ ఎంపీడీఓను కోరుతున్న బాధితులు

ఉరవకొండ: దయలేని కూటమి ప్రభుత్వం..దివ్యాంగుల పొట్టకొట్టేందుకు సిద్ధమైంది..అధికారంలోకొచ్చిన తర్వాత పింఛన్ డబ్బు పెంచినట్టే పెంచి.. ఇప్పుడు అనర్హత పేరిట వందలాదిగా పింఛన్లు తొలగించేందుకు పూనుకుంది. ఇప్పటికే దివ్యాంగుల రీవెరిఫికేషన్ పూర్తి కావడం, ఇందులో 40 శాతంలోపు వికలత్వం ఉన్న వారిని తొలగిస్తూ నోటీసులు జారీ చేసింది. ఒక్క ఉరవకొండ మండలంలోనే 289 మంది దివ్యాంగులకు అనర్హుల జాబితాలో ఉంచింది. ఇందులో కనీసం నడవలేని వారు, మంచానికే పరిమితమైన వారిని కూడా వదిలిపెట్టలేదు.



▸▸ ఉరవకొండ చెంగల వీధికి చెందిన ఉమాదేవి కాళ్లు, చేతులు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉంది. నెల నెలా అందే పింఛనే ఆధారం. ఇటీవల పింఛన్ తొలగిస్తూ నోటీసులు జారీ చేయడంతో లబోదిబోమంటోంది. సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని కన్నీటి పర్యంతం అవుతోంది.



▸▸ ఈచిత్రంలో కనిపిస్తున్న పి.జ్యోతి భర్తపేరు రాధకృష్ణ ఉరవకొండ పట్టణంలోని ఎస్ఎల్ఎన్ కాలనీలో నివాసం ఉంటున్న జ్యోతి.. 60 శాతం (చెవుడు, మూగ) దివ్యాంగురాలు. ఈమె సదరం క్యాంపునకు వెళ్లగా రీ వెరిఫికేషన్‌లో 40 శాతం లోపు మాత్రమే వికలత్వం ఉందని తేల్చారు. ఇప్పటికే అధికారులు నోటీసులు కూడా అందించారు.



▸▸ ఈఫొటోలో కనిపిస్తున్న ఆయన పేరు వడ్డే కృష్ణమూర్తి ఉరవకొండ పట్టణానికి చెందిన ఇతను మతి స్థిమతం లేదు. కాళ్లు, చేయి మూర్ఛతో పనిచేయడం లేదు. ఇతనికి రూ.15 వేలు పింఛన్ అందేది. కూటమి సర్కారు పింఛన్ల కోతలో భాగంగా ఇంటి వద్దే రీవెరిఫేషన్ పేరుతో అర్హుడు కాదని నిర్ధారించారు.



▸▸ ఈచిత్రంలో శాశ్వత వైకల్యంతో బాధపడుతున్న బాలిక పేరు గనపమల్లేశ్వరి. ఉరవకొండకు చెందిన బారా మసాలా మల్లి, గీతాంజలి దంపతుల కుమార్తె. శాశ్వత వికలత్వం సర్టిఫికెట్ కలిగిన ఈ బాలికకు పింఛనే ఆధారం. తల్లిదండ్రులు దినసరి పనులకు వెళ్తే గానీ కుటుంబం గడవని పరిస్థితి.అయితే ఇటీ వల పింఛన్ తొలగించేందుకు నోటీసులు అందించారు.

పింఛన్‌దారులపై కూటమి కొరడా

రాయదుర్గంటౌన్: ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడం కూటమి ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య. పునఃపరిశీలన పేరుతో సంక్షేమ పథకాల్లో కోతవిధించడం పనిగా పెట్టుకుంది. అనర్హత పేరుతో పింఛన్‌దారుల పొట్ట కొడుతోంది. రీవెరిఫికేషన్ పేరుతో పింఛన్లను తొలగిస్తున్నట్లు తాజాగా రాయదుర్గంలో వివిధ రకాల దివ్యాంగ పింఛన్‌దారులు 92 మందికి నోటీసులు జారీ చేశారు. ఆగస్టు నెల పింఛన్ కూడా పంపిణీ చేయలేదు. చాలా ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు కొత్త నిబంధనలతో కొర్రీ పెడుతూ గత సదరం ధ్రువీకరణ పత్రాలను రద్దు చేసి, దివ్యాంగ శాతం తక్కువ ఉందన్న నెపంతో వందలాదిగా పింఛన్లు తొలగిస్తోంది. రాయదుర్గం పురపాలక సంఘంలో వివిధ కేటగిరీల్లో మొత్తం 6,604 సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. వీటిలో 782 మంది వివిధ రకాల దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. ఇటీవల సదరం వెరిఫికేషన్‌లో 92 మంది దివ్యాంగ పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేశారు.

- ఈ పక్క చిత్రంలోని సరళ శంకరమ్మ రాయదుర్గంలోని నేసేపేట చౌడమ్మగుడి ఏరియాలో నివాసం ఉంటోంది. పింఛన్ రూ.200 ఉన్నప్పటి నుంచి పింఛన్ పొందుతోంది. ఈమెకు 90 శాతం అంధత్వం ఉంది. ఇటీవల దివ్యాంగురాలి పింఛన్‌ను తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. తమ్ముడి సాయంతో మంగళవారం మున్సిపాలిటీకి వచ్చి అర్జీ అందజేసింది.



రాయదుర్గం పురపాలక సంఘం



రీవెరిఫికేషన్‌కు వెళ్లాలి



40 శాతం కన్నా తక్కువ వికలత్వం ఉన్న దివ్యాంగులు మరోసారి రీవెరిఫికేషన్‌కు సిద్ధం కావాల్సి ఉంటుంది. మండల వ్యాప్తంగా ఇప్పటికే 278 మందికి నోటీసులు జారీ చేశాం. అర్హులైన దివ్యాంగులకు మరోసారి వైద్యులు పరీక్షలు నిర్వహించి, పర్సెంటేజీలు పరిశీలిస్తారు.

\- రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



తలారి రంగయ్యను సన్మానిస్తున్న పోలేపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం : ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పొబ్బర్లపల్లి, పోలేపల్లి గ్రామ పంచాయతీల్లో మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో «బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ» కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ కూటమి నేతలు అధికారంలోకి రావడానికి ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అంటూ లేనిపోని హామీలు ఇచ్చి, ఇంత వరకూ అమలు చేయలేదని మండిపడ్డారు. నియోజకవర్గంలోనూ కూటమి పాలన మోసాలు, అన్యాయాలు, అక్రమాలతోనే సాగుతోందన్నారు. బీటీపీ కాలువ మట్టి తరలింపు , కళ్యాణి వైన్స్, ఈ స్టాంపులు, కొండలు గుట్టలు మట్టి, ఇసుక దందా ఇలా ఎన్నో విధాలుగా అక్రమ సంపాదనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. అక్రమాలకు అడ్డుకట్టవేయాలన్నా.. ప్రజల సొమ్ము దోచుకుంటున్న వారికి బుద్ధి చెప్పాలన్నా.. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో మన సత్తా ఏమిటో చూపుదామని పిలుపునిచ్చారు.

గ్రామ కమిటీల ఏర్పాటు..

అనంతరం ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ లను ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులను పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కంబాల నాగరాజు, మండల కన్వీనర్లు గొల్ల సూరి, హనుమంతరాయుడు, ఎంపీపీలు భీమేష్, అంజి, పార్టీ జిల్లా, తాలూకా, మండల అనుబంధ సంఘాల నాయకులు గోపాలరెడ్డి, మంజు, కృష్ణమూర్తి, లీగల సెల్ బీటీ రామాంజనేయులు, అభిలాష్‌రెడ్డి, దొడఘట్ట మురళి, పాతలింగ, తిమ్మారెడ్డి, మంజు, వసంత్, జానీ, మహాత్మరెడ్డి, శరణప్ప, సర్పంచులు మమత, శెట్టిగారి మంజునాథ, ఎంపీటీసీ నరసింహ, నాయకులు గంగాధర, లోకేష్, నాగేంద్రప్ప, లింగన్న, పాలయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి నూతన బస్సులు

రాయదుర్గంటౌన్: స్త్రీశక్తి పథకం కింద త్వరలో కొత్త బస్సులు అందుబాటులోకి రానున్నాయని ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. మంగళవారం రాయదుర్గం ఆర్టీసీ డిపోను ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ పరిశీలించారు. మడకశిర, కళ్యాణదుర్గం డిపోలను తనిఖీ చేసి, సాయంత్రం ఆయన రాయదుర్గానికి చేరుకున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ రాయలసీమ జోన్ చైర్మన్ పూల నాగరాజు, స్థానిక డిపో మేనేజర్ శ్రీనివాసరావుతో కలిసి డిపో, గ్యారేజీని పరిశీలించారు. అనంతరం స్థానిక గ్యారేజీలో ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

అంతర్ రాష్ట్ర సర్వీసుల్లో సౌకర్యం కల్పించండి..

అంతర్ రాష్ట్ర సర్వీసుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఏపీఎస్ ఆర్టీసీ రాయలసీమ జోన్ చైర్మన్ పూల నాగరాజు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కోరారు. సరిహద్దు ప్రాంతాలు కావడంతో అధిక శాతం రాకపోకలు ఉంటాయన్నారు. అలాగే ఆమ్‌ఆద్మీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ బాబు ఆర్టీసీ యండీని కలిసి సరిహద్దు ప్రాంతాల వరకు స్త్రీశక్తి పథకం వర్తింపజేయాలని కోరారు. స్పందించిన ఎండీ మాట్లాడుతూ ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గంలోని ఆర్టీసీ డిపో శిథిలావస్థకు చేరుకుందని, నూతన డిపో నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు.



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందిస్తున్న పూల నాగరాజు

ఎడతెరిపిలేని వానలు

- చలిగాలులకు వణికిపోతున్న జనం
- కొనసాగుతున్న వాయుగుండం

రాయదుర్గం/రాయదుర్గంటౌన్:అల్పపీడన ప్రభావంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాలు తడిచి ముద్దవుతున్నాయి. మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. చలిగాలుల తాకిడికి జనం వణికిపోతున్నారు. జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. మరో రెండు రోజులు వాయుగుండం కొనసాగుతున్నట్టు వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో చిరు వ్యాపారులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఖరీఫ్‌లో సాగైన మొక్కజొన్న,ఉల్లి, పత్తి, వేరుశనగ, ఆముదం పంటల్లోకి నీరు చేరింది.



రాయదుర్గంలో కురుస్తున్న జడివాన

అల్పపీడన ప్రభావం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాయదుర్గంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని జడివాన నమోదవుతోంది. జడివానతో రాయదుర్గంలోని మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. కొన్ని చోట్ల రోడ్లపై వర్షపునీటి నిల్వతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. బోరుబావుల కింద సాగైన మొక్కజొన్న, వేరుశనగ పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మట్టి మిద్దెల్లో నివాసం ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వైభవంగా ఆది చెన్నకేశవస్వామి రథోత్సవం



ఆదిచెన్న కేశవస్వామి



కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం



వేడుకలకు వచ్చిన భక్తులు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలోని ఆది చెన్నకేశవస్వామి ఆలయంలో రథోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ధ్వజా రోహణం,అభిషేకం, నవగ్రహపూజాహోమం, అభిషేకం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి, కుటుంబ స భ్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవ స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం, పల్లకీ సేవ జరగనున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయఈఓ అంగదాల కృష్ణయ్య, క్లర్క్ లాలేష్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి రథోత్సవం: ఆలయంలో బుధవారం ఉదయం స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకం, 11 గంటలకు పల్లకీసేవ, మడుగుతేరు, సాయంత్రం 5 గంటలకు ఉట్లఉత్సవం, రథోత్సవం జరగనున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. 21 స్వామికి అభిషేకం, పల్లకీ సేవ, వసంతోత్సవం, రాత్రి 8గంటలకు భూదేవి, లక్ష్మమ్మ దోపులు, పల్లకీ సేవ ఉంటుందని ఈఓ తెలిపారు.

రైతు సంబరం ట్రాక్టర్ ర్యాలీలో అపశ్రుతి

కణేకల్లు: మండల కేంద్రంలో 'సూపర్ సిక్స్ .. సూపర్‌హిట్ ' కార్యక్రమంలో భాగంగా రైతు సంబరం పేరుతో మంగళవారం నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీలో అపశ్రుతి చోటుచేసుకుంది. కణేకల్లులోని ఎస్సీ కాలనీకి చెందిన హరిజన సురేష్ ద్విచక్ర వాహనంపై బస్టాండ్ వైపునకు వెళ్తుండగా, గ్రామీణ బ్యాంకు వద్ద ర్యాలీగా వెళ్తున్న ఓ ట్రాక్టర్ అతని బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో అతని కుడికాలికి గాయమైంది. స్థానికులు గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బాధితుడికి రూ.10 వేలు ఆర్థిక సాయంఅందించారు. ప్రథమ చికిత్స అనంతరం అతన్ని మెరుగైన చికిత్స కోసం వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు.



గాయపడిన హరిజన సురేష్

సంక్షిప్త సమాచారం

తుంకూరు రైల్వే మార్గం నిర్మించాలి

ఉరవకొండ: గుంతకల్లు నుంచి వయా ఉరవకొండ మీదుగా తుంకూరు రైల్వే మార్గం నిర్మించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ్ కేశవ్‌నాయక్ కేంద్రానికి మంగళవారం లేఖ రాసినట్లు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1933లోనే అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం కర్ణాటకలోని తుంకూరును కలుపుతూ ఉరవకొండ, కళ్యాణదుర్గం, మడకశిర కర్ణాటక రాష్ట్రంలోని మధుగిరి, పావుగడ ప్రాంతాల మీదుగా బ్రాడ్ గేజ్ నిర్మించాలని సర్వే కూడా చేశారని గుర్తు చేశారు. రైల్వే ప్రాజెక్టు కోసం తాను స్వయంగా 2019 నవంబర్‌లో పాదయాత్ర కూడా చేసినట్లు గుర్తుచేశారు.

అర్హుల పింఛన్లు తొలగించడం దారుణం

కళ్యాణదుర్గం రూరల్: అర్హులైన దివ్యాంగులకు నోటీసులు ఇచ్చి సర్టిఫికెట్ రద్దు చేసి, పింఛన్లు నిలిపివేయడం సరికాదని దివ్యాంగుల సంఘం పట్టణ అధ్యక్షుడు దొణస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించిన సందర్భంగా ఈనెల 21న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో కళ్యాణదుర్గం నియోజవర్గం వ్యాప్తంగా ఉన్న బాధిత పింఛన్‌దారులు పాల్గొనాలని కోరారు.

ఆరు గ్రామాలకు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు

వజ్రకరూరు: మండలంలో ఆరు గ్రామాలకు ఓహెచ్ఎస్ఆర్ మంచినీటి ట్యాంకులు మంజూరయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మంజునాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో గంజికుంట, రాగులపాడు, చాబాల, పొట్టిపాడు, కమలపాడు, జరుట్లరాంపురం కొట్టాల గ్రామాలకు ఓహెచ్ఎస్ఆర్ మంచినీటి ట్యాంకులు మంజూరయినట్లు తెలిపారు. ఒక్కో ట్యాంకుకు రూ. 25 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

వక్కల లారీ బోల్తా

కుందుర్పి: మలయనూరు - కుందుర్పి ప్రధాన రహదారిలో మంగళవారం ఉదయం కర్ణాటక నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తున్న లారీ బోల్తా పడింది. అయితే పెనుప్రమాదం తప్పింది. కర్ణాటక నుంచి వక్కల లోడుతో బీదర్ వెళ్తుండగా మలయనూరు నిజవళ్లి గేట్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరభద్రస్వామికి పూజలు



విడపనకల్లు: మండల పరిధిలోని ఉండబండ వీరభద్ర స్వామి ఆలయంలో వీరభద్రస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

పాపంపల్లి వద్ద శ్రీరామరెడ్డి పైప్ లైన్ లీక్

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని పాపంపల్లి శ్రీరామరెడ్డి పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది.పైపులైన్ ప్రధాన రోడ్డు పక్కన ఉండటంతో నీరంతా ఎగిసిపడుతోంది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఆర్టీసీ బస్సు నుంచి కింద పడిన మహిళ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు ఎంఏసీ హౌసింగ్ లేఅవుట్ వద్ద కదిలే ఆర్టీసీ బస్సు నుంచి కింద పడి ఓ మహిళకు స్వల్పగాయాలయ్యాయి. వివరాలు.. స్థానిక ఎంసీఏ లేవుట్ వద్ద నివాసం ఉంటున్న భూలక్ష్మి మంగళవారం ఉదయం ఉరవకొండకు వెళ్లి తిరిగి రాత్రి 9 గంటలకు రాయదుర్గం ఆర్టీసీ బస్సులో వచ్చింది. ఆమె దిగాల్సిన స్టాప్ రావడంతో కండక్టర్‌ను బస్సు నిలపాలని కోరగా, అతను నిరాకరించాడు. దీంతో ఆమె డోర్ వద్ద ఫుట్‌బోర్డుపై నిల్చొని బస్సు నిలపాలని కోరింది. ఆసమయంలో బస్సు నిదానంగా వెళ్తుండగా, ఆగిందని భావించి కిందకు దిగే ప్రయత్నం చేయడంతో జారి పడింది. ఈ ప్రమాదంలో ఆమె కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను అదే బస్సులో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

శ్రావణి ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో ఈ నెల 14న శ్రావణి అనే వివాహిత ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేసింది. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ నియోజవర్గ కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ, భర్త,అత్త, మామలు వేధింపులకు గురి చేస్తున్నారని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. అందుకు కారకుల పేర్లు ఆడియా కాల్‌లో తెలియజేసినట్లు తెలిపారు. శ్రావణిని పోలీసులు, టీడీపీ నాయకులే హత్య చేశారని విమర్శించారు.

విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రె

బొమ్మనహాళ్: ఉప్పరహాళ్‌కు చెందిన బి.సురేష్ అనే వ్యక్తికి చెందిన 4 గొర్రెలు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాయి. వివరాలు.. సురేష్ మంగళవారం మేత కోసం గొర్రెలను తీసుకెళ్లాడు. ఎల్‌బీ నగర్ వద్ద రోడ్డు పక్కన గొర్రెలు మేస్తుండగా, విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురై నాలుగు గొర్రెలు చనిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ముందుకు కదలని వర్షపునీరు



గూళ్యపాళ్యంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

వజ్రకరూరు: గూళ్యపాళ్యం గ్రామంలోని ప్రధాన రహదారిలో వర్షపునీరు ముందుకు కదలడం లేదు. ఇటీవల మూడు రోజుల క్రితం గూళ్యపాళ్యంలో భారీ వర్షం కురిసింది. బస్టాండ్ నుంచి ఊరులోకి వెళ్లే దారిలో వర్షపునీరు నిలిచింది. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేక వర్షపునీరు ముందుకు కదలడంలేదు. వర్షపునీరు నిలుస్తుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీటి వృథా అరికట్టండి



కణేకల్లు రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయం పక్కన లీకేజీ అవుతున్న తాగునీరు

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డులో విద్యుత్‌శాఖ కార్యాలయం పక్కన ప్రధాన రహదానికి ఆనుకొని వెళ్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పైప్‌లైన్ గేట్‌వాల్వ్ పగిలిపోయింది. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. సమీప నివాస గృహాల వద్దకు నీరు చేరి, అపరిశుభ్రత నెలకొంది. దారి పొడవునా ఉండే గేట్ వాల్వ్‌లు చాలా చోట్ల దెబ్బ తిన్నాయి. దీంతో కొళాయిలకు నీరు చేరక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాయదుర్గం మీదుగా వెళ్లే పైప్‌లైన్ 74 ఉడేగోళం గ్రామానికి మీదుగా సుమారు 20 పల్లెలకు సరఫరా అవుతోంది.

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ నేత నాగార్జున

రాయదుర్గంటౌన్: ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25 వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కొట్రేష్, ఏపీ రైతు సంఘం కార్యదర్శి తిప్పేస్వామి, నాగయ్య, తేజ, సురేష్, వన్నప్ప పాల్గొన్నారు.

కూడేరు: ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25 వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. మంగళవారం మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. మండల సహాయ కార్యదర్శి మలరాయుడు, రైతు సంఘం కార్యదర్శి రమణ, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, వెంకటేష్, కాశీం పీరా, నారాయణమ్మ, అశ్వర్థమ్మ పాల్గొన్నారు.

21న చలో కలెక్టరేట్

కళ్యాణదుర్గం: అర్హులైన దివ్యాంగులకు నోటీసులిచ్చి, సర్టిఫికెట్లను రద్దు చేసి పింఛన్ నిలిపివేసిన కూటమి ప్రభుత్వంపై నిరసన తెలియజేసేందుకు దివ్యాంగులు ఈనెల 21న ఛలో కలెక్టరేట్ నిర్వహించనున్నారు. ఈమేరకు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్ మంగళవారం తెలిపారు. పింఛన్ రద్దు అయినట్లు నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.